సాక్షి విజయనగరం

శుక్రవారం । 27 । జూన్ । 2025



రామయ్యా..చూడవేమయ్యా..!

సాక్షాత్తు శ్రీరాముడే నడయాడిన నేలగా రామ తీర్థాన్ని భక్తులు విశ్వసిస్తుంటారు. నీలాచలం పర్వతంగా పిలుస్తున్న ఇక్కడి బోడికొండను అక్రమార్కులు గుల్లచేస్తున్నారు. - 8లో



వృద్ధిరేటు పెరిగేలా ప్రణాళికలు

వ్యవసాయం, అనుబంధ రంగాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో వృద్ధిరేటు గణనీయంగా పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. - 8లో



దోమల కాయిల్స్‌తో అనర్థాలు

దోమకాటుతో అనారోగ్యానికి గురవుతామన్న భయంతో మార్కెట్‌లో లభించే నాసిరకం మస్కిటో కాయిల్స్‌ను వినియోగించవద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నీలయ్యవలసలో ఏనుగుల గుంపు



అక్కసాగరంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

వంగర: మండల పరిధి నీలయ్యవలస గ్రామ సమీపంలోకి ఏనుగుల గుంపు గురువారం చేరుకుంది. రెండు రోజుల కిందట కొత్తమరువాడలో ప్రవేశించిన తొమ్మిది ఏనుగులు సీతాదేవిపురం, గంగాడ, నారంనాయుడువలస గ్రామాలను దాటుకొని నీలయ్యవలస గ్రామం అక్కసాగరం సమీపంలోకి చేరుకున్నాయి. వరి వెద, మొక్కజొన్న పంటల్లో సంచరిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏడీకి భోజన కార్మికుల సమ్మెనోటీసు



సమ్మెనోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు సుధారాణి, తదితరులు

విజయనగరం గంటస్తంభం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖ ఏడీకి ఏపీ మధ్యాహ్నభోజన పథకం కార్మికులు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ 45వ కార్మిక సదస్సు నిర్ణయం ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, మెనూ చార్జీల కింద ఒక్కో విద్యార్థికి కనీసం రూ.20లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల నుంచి తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ప్రమాద బీమాను వర్తింపజేయాలన్నారు. సమ్మెనోటీసు ఇచ్చిన వారిలో లక్ష్మి, ఉమా, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి నిద్ర పోతోందా?

- గిరిజన సంఘం సూటిప్రశ్న



ధారపర్తి నుంచి గర్భిణిని డోలీలో మోసుకొస్తున్న గిరిజనులు

శృంగవరపుకోట: మండలంలోని ధారపర్తి పంచాయతీకి చెందిన గిరిజన మహిళ పురిటి నొప్పులతో అల్లాడి శిశువుకు జన్మనిచ్చింది. ప్రసవానంతరం తల్లీబిడ్డలకు వైద్యం నిమిత్తం గ్రామస్తులు, కుటుంబసభ్యులు హుటాహుటిన డోలీ కట్టి వర్షం కురుస్తుండగా, జారుతున్న రాళ్లు, రప్పలు, కొండ బురద మధ్య 20కి.మీ మోసుకొచ్చి దబ్బగుంటకు చేర్చారు. అక్కడి నుంచి ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో తరలించారు. ఆస్పత్రిలో వైద్యసిబ్బంది తల్లీబిడ్డలకు ప్రాథమిక వైద్యం అందించారు. ఈ ఘటనపై గిరిజన సంఘం నేతలు, స్థానిక యువకులు మాట్లాడుతూ కూటమి సర్కారు కొలువు తీరగానే డిప్యూటీ సీఎం గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తామన్నారు. గిరిశిఖర గ్రామాలకు డోలీ మోతలు ఉండవని కూటమి పెద్దలు సెలవిచ్చారు. మంజూరైన రోడ్డు పనులు ఎందుకు చేయడం లేదు? కూటమి పెద్దలు కునుకు నిద్రపోతున్నారా? అని మండిపడ్డారు.

వెలుగు ఉద్యోగులకు చీకటి బదిలీలు!

‘ఓ మహిళా డీపీఎం విజయనగరం జిల్లాలో బాధ్యతలు చేపట్టి రెండేళ్ల పదినెలలైంది. ఆమె బదిలీ కోసం ఎలాంటి ముందస్తు దరఖాస్తు చేసుకోలేదు. నిబంధనల ప్రకారం ఆమెను బదిలీ చేయరాదు. కానీ, ఆమెను ఏకంగా వెయ్యి కిలోమీటర్ల దూరంలోని నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు.’

జిల్లాలో 53 మంది ఏపీఎంలు ఉన్నారు. వీరిలో సాధారణ బదిలీల్లో ఐదేళ్లు పూర్తయిన ముగ్గురిని బదిలీ చేయాల్సి ఉన్నా రాజకీయ ఒత్తిడితో వారి బదిలీ జోలికి వెళ్లలేదు. జిల్లాలో 22 మంది ఏపీఎంలు ఎక్కువగా ఉన్నట్టు నిర్ధారించి సెర్ప్‌లో ఇతర జిల్లాలకు సర్దుబాటు చేసేందుకు ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆరుగురు ఏపీఎంలు కౌన్సెలింగ్‌ను బహిష్కరించడంతో వారి బదిలీలను పక్కన పెట్టేశారు. కౌన్సెలింగ్‌కు హాజరైన మరో ఐదుగురికి జిల్లాలోనే పోస్టింగ్‌లు కేటాయించారు. మిగిలిన 11 మందిని నిబంధనలు కాదని జోన్ దాటి కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు బదిలీ చేశారు. వీరికి అధికార పార్టీ నేతల అండదండలు లేకపోవడం వల్లే దూర ప్రాంతాలకు బదిలీ చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.’



- నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు
- అయినవారికి జిల్లాలో, కానివారికి ఇతర జిల్లాలకు స్థాన చలనం
- హోదా, వేతనం మరిచి ప్రభుత్వ నిర్ణయం
- ఆవేదనలో ఉద్యోగలోకం

ఉత్తర్వుల మేరకు జాబితాలు పంపించాం

ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారికి బదిలీలు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఆ మేరకు ఏపీఎం, డీపీఎంల పేర్లను పంపించాం. ఆ మేరకు బదిలీల ఉత్తర్వులు వచ్చాయి.

– కళ్యాణ చక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ, విజయనగరం

విజయనగరం:

వెలుగు విభాగంలో ప్రభుత్వం చేపట్టిన సాధారణ, సర్దుబాటు పేరిట నిర్వహించిన బదిలీ ప్రక్రియలో పారదర్శకత లోపించింది. నిబంధనలకు విరుద్ధంగా, రాజకీయ కక్ష సాధింపుతో బదిలీలు చేశారంటూ ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. నిబంధనలకు పాతరేసి జోన్ దాటించి ఎలా బదిలీచేస్తారని కొందరు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని విమర్శిస్తున్నారు. కొందరు ఉద్యోగులు న్యాయస్థానం తలుపుతట్టేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

నిబంధనలు కాదని..

బదిలీలకు సెర్ప్ అధికారులు కొన్ని మార్గదర్శకాలు జారీ చేయగా... అందుకు విరుద్ధంగా బదిలీలు జరిగాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 23 ప్రకారం ఒక చోట ఐదేళ్లు సర్వీసు పూర్తిచేసిన వారికి తప్పనిసరిగా బదిలీ చేయాలి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన సొంత జిల్లా అయిన వారికి కూడా బదిలీ చేయాలి. ఈ ప్రకారం జిల్లాలో పనిచేస్తున్న డీపీఎంల్లో ఐదేళ్లు దాటిన 8 మందికి బదిలీ చేయాల్సి ఉండగా ఇద్దరిని జిల్లాలోనే కొనసాగించారు. వారిద్దరి సర్వీసు ఐదేళ్లు పూర్తికావడంతో పాటు సొంత జిల్లాకు చెందిన వారే అయినా రాజకీయ నేతల ఒత్తిడితో ఇక్కడే కొనసాగించినట్టు సమాచారం. మరో నలుగురికి పక్కజిల్లాలోను, మరొకరికి కోనసీమ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఓ మహిళా డీపీఎం సరీ్వసు రెండేళ్ల పదిలనెలలే అయినా రాజకీయ కక్షతో నంద్యాల జిల్లాకు బదిలీ చేయడం విమర్శలకు తావిస్తోంది. మిగులు సిబ్బందిగా చూపిస్తూ 22 మంది ఏపీఎంల బదిలీల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని, డబ్బులిచ్చేవారిని బదిలీల్లో మినహాయింపు ఇచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్దుబాటు చేయలేక..

2000 సంవత్సరంలో వెలుగు వచ్చిన మొదట్లో జిల్లా పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక కావడంతో ఎక్కువమంది ఉద్యోగులను నియమించారు. తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు కావడం, ఆయా జిల్లాల్లో పోస్టింగులు ప్రకారం జిల్లాలో పోస్టుల కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారు. అనంతరం కాలంలో కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ సమస్య వచ్చినా అప్పట్లో మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ సలహా, సహకారంతో వారిని అధికారులు జిల్లాలోనే సర్దుబాటు చేస్తూ వచ్చారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చినపుడు సర్దుబాటు చేయలేక 2016లో 9 మందిని, 2025లో 11 మంది ఏపీఎంలను, జిల్లా నుంచి ఉమ్మడి తూర్పుగోదావరికి పంపించారు.

వారివి అంత పెద్ద పోస్టింగులా?

గతంలో డీపీఎం పోస్టు పరిధి జోన్‌స్థాయి, ఏపీఎం పోస్టు స్థాయి జిల్లా వరకు ఉండేది. డీపీఎం పోస్టుస్థాయిని తాజాగా రాష్ట్రస్థాయికి పెంచగా ఏపీఎం జోన్ స్థాయికి పెంచారు. సాధారణంగా జిల్లాస్థాయి అధికారులకు మాత్రమే రాష్ట్రస్థాయిలో బదిలీలు జరుగుతుంటాయి. అలాంటిది ఒక డీపీఎంకు రాష్ట్రస్థాయిలో బదిలీ చేయడం విశేషం. తహసీల్దారు, ఎంపీడీఓలు, ఇతర మండలస్థాయి అధికారులకు సైతం జిల్లా స్థాయిలో బదిలీలు జరుగుతుండగా ఏపీఎంలకు జోన్, జోన్ దాటి బదిలీలు చేయడం గమనార్హం. అంతంత మాత్రపు జీతాలతో అంతదూరం వెళ్లి విధులు ఎలా నిర్వహించాలంటూ ఉద్యోగులు నిట్టూర్పుతున్నారు. ఈ బదిలీల్లో ఎక్కువగా ఇబ్బంది పడింది జిల్లాకు చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీల్లో జిల్లా నాయకులకు స్థానం

- జాబితాను విడుదల చేసిన పార్టీ కేంద్ర కార్యాలయం

విజయనగరం:

పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీలో కీలక నియామకాలు జరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాకు చెందిన పలువురు నాయకులకు పార్టీ రాష్ట్ర కమిటీల్లో స్థానం కల్పిస్తూ కేంద్ర కార్యాలయం గురువారం జాబితాను విడుదల చేసింది. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధా కార్యదర్శిగా విజయనగరం నియోజకవర్గానికి చెందిన వెంపడాపు విజయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.కోటకు చెందిన తూర్పాటి వరలక్ష్మి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బొబ్బిలికి చెందిన తూముల అచ్యుతవల్లిని నియమించారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా గజపతినగరం నియోజకవర్గానికి చెందిన జరజాపు సత్యారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా చీపురుపల్లికి చెందిన దన్నాన జనార్దనరావు, రాజాంకు చెందిన గేదెల వెంకటేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ రాష్ట్ర ఆర్‌టీఐ విభాగం కార్యదర్శిగా చీపురుపల్లికి చెందిన కెంగువ మధుసూదనరావు, సంయుక్త కార్యదర్శులుగా గజపతినగరానికి చెందిన సిరిపురుపు ఆదినారాయణ, రాజాంకు చెందిన జె.జగదీష్‌ను నియమించారు. పార్టీ బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.కోటకు చెందిన దొగ్గా సత్యవంతుడు, సంయుక్త కార్యదర్శులుగా గజపతినగరానికి చెందిన పట్నాన అప్పలవెంకటరమణ, చీపురుపల్లికి చెందిన ఎడ్ల అప్పారావు నియామకమయ్యారు. కమిటీల్లో నూతనంగా స్థానం దక్కించుకున్న నాయకులు పార్టీ బలోపేతానికి ఆయా రంగాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు.

న్యాయం చేయండి బాబూ..!



ఎస్.కోట పోలీస్‌స్టేషన్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న జిందాల్ నిర్వాసిత మహిళలు

ఎస్.కోట: జిందాల్ కోసం భూములు కోల్పోయాం.. ఏళ్లు గడిచినా మాకు న్యాయం జరడంలేదు.. పిల్లలకు ఉద్యోగాలు లేవు.. పరిహారం పూర్తిస్థాయిలో అందలేదు.. ప్రస్తుత ధరల ప్రకారం పరిహారం అందజేసే దారి కనిపించడం లేదు.. మా సమస్యపై శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తామంటే అనుమతులు లేవంటూ అడ్డగోలు నిబంధనలు విధిస్తున్నారని పలువురు మహిళలు మీడియా ముందు గురువారం వాపోయారు. మాగోడు ఎవరికి చెప్పాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. కంపెనీలు రావాలి.. కావాలి అంటూ బిర్యానీలు తింటూ నిరసన తెలిపేవారికి అనుమతులు ఉన్నాయట.. మా కుటుంబాల ఆకలి కేకలు వినిపించేందుకు అనుమతులు తెచ్చుకోవాలట.. ఇదెక్కడి న్యాయం ‘బాబూ’ అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. నిరసన శిబిరం నిర్వహించేందుకు అనుమతివ్వాలని ఎస్.కోట సీఐ నారాయణమూర్తికి విజ్ఞప్తిచేస్తే, రెవెన్యూ అధికారులను అడగాలని కసురుకున్నారన్నారు. ఇక్కడికి వచ్చి తహసీల్దార్ శ్రీనివాసరావుకు మా గోడు చెబితే అంతా ఆలకించిన ఆయన మీకు పర్మిషన్ ఇచ్చే అధికారం నాకు లేదమ్మా అంటూ పంపించేశారన్నారు. మా భూముల్లో చెట్ల తొలగింపునకు అనుమతులు ఎవరిచ్చారో చెప్పాలన్నారు. పేదవారిని ఏం చేసినా అడిగేవారు లేరనే అధికారంతో మా జీవితాలను నాశనం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు వాస్తవాలు తెలుసుకోవాలని, దళారీల మాటలు నమ్మి అమ్ముడుపోవద్దని విజ్ఞప్తిచేశారు.

ఏపీ పీజీసెట్‌లో విజయకేతనం



డి.నవీన్ (జియాలజీలో ఫస్ట్ ర్యాంక్)



వై.ఈశ్వర్‌గేయ (జియాలజీలో సెకెండ్ ర్యాంక్)



గౌరీశ్వరి (తెలుగులో ఫస్ట్‌ర్యాంకర్)

విజయనగరం అర్బన్/బొబ్బిలిరూరల్: రాష్ట్రంలోని గుర్తింపు పొందిన యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పీజీసెట్–2025లో విజయనగరం జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. జియాలజీ సబ్జెక్టులో మహరాజా అటానమస్ కళాశాలకు చెందిన డి.నవీన్ ఫస్ట్, వై.ఈశ్వర్‌గేయ సెకెండ్ ర్యాంకులు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావుతో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు టి.శంకరరావు, కె.సత్యనారాయణ నాయుడు, జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.గణపతిరావు గురువారం అభినందించారు.

- బొబ్బిలి మండలం పెంట గ్రామానికి చెందిన చింతల గౌరీశ్వరి తెలుగు సబ్జెక్టులో 88 మార్కులతో రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఆమెను తల్లిదండ్రులు చింతల సత్యం, అనసూర్యతో పాటు గ్రామస్తులు అభినందించారు.

ఈఈను నేను.. కాదు నేను..!

- ఇద్దరు ఈఈల మధ్య కుర్చీలాట
- ప్రభుత్వం నియమించిందని ఒకరు, కోర్టు జీఓ సస్పెండ్ చేసిందని మరొకరు..
- ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ పోస్టుపై నెలకొన్న ఉత్కంఠ



కేవీఎస్ఎన్ కుమార్, ఈఈ



రమాదేవి, ఈఈ

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖలో ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) పోస్టుపై ఉత్కంఠ నెలకొంది. ఇద్దరు ఈఈల మధ్య గురువారం కుర్చీలాట కొనసాగింది. కార్యాలయంలో వేర్వేరు కుర్చీల్లో ఇద్దరు కూర్చోవడంతో ఎవరు తమ ఈఈ అన్న ప్రశ్న కిందిస్థాయి ఉద్యోగుల్లో తలెత్తింది. కార్యాలయానికి వచ్చేవారు ఎవరికి రిపోర్టు చేయాలో తెలియక సందిగ్ధంలో పడ్డారు. వివరాలు పరిశీలిస్తే.. ఏడు నెలల కిందట సీతంపేట ఈఈ పోస్టు ఖాళీగా ఉండడంతో రమాదేవిని నియమించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఈ నెల 9న ఆమె స్థానంలో కె.వి.ఎస్.ఎన్ కుమార్‌ను ఇక్కడ నియమించి రమాదేవిని నెల్లూరుకు బదిలీ చేశారు. ఈ నెల 11న కుమార్ సీతంపేట ఈఈగా బాధ్యతలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా బాధ్యతలు స్వీకరించిన ఏడు నెలలకే తనను బదిలీ చేశారంటూ రమాదేవి హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు బదిలీ జీఓను హైకోర్టు ఆరువారాల పాటు సస్పెండ్ చేసింది. కోర్టు ఆదేశాలతో తను ఇక్కడే ఈఈగా కొనసాగుతున్నట్టు రమాదేవి స్పష్టం చేశారు. ప్రభుత్వ బదిలీ జీఓ ప్రాప్తికి తనుకూడా ఇక్కడే ఈఈగా విధులు నిర్వహిస్తున్నట్టు కుమార్ తెలిపారు. బదిలీల్లో అక్రమాల వల్లే ఇలాంటి ఘటనలు తలెత్తుతున్నాయంటూ ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాల్సిందే.

సర్వేయర్ల నిరసన బాట



సమస్యల పరిష్కారం కోరుతూ సచివాలయ సర్వేయర్లు రోడ్డెక్కారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ప్లకార్డులు ప్రదర్శించారు. నిరసన గళం వినిపించారు. జీఓ నంబర్ 5ను సవరించాలని, గుమస్తాకంటే తక్కువ ఉద్యోగాలకు గెజిటెడ్ ఉద్యోగుల స్థాయి నిబంధనలు విధించడం తగదన్నారు. బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని కోరారు. పనిభారం ఉన్నా ఉద్యోగోన్నతులు కల్పించకపోవడం విచారకరమన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: రెవెన్యూ వినతులకు న్యాయమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చే వినతుల్లో 90 శాతం రెవెన్యూకు సంబంధించినవే ఉంటున్నాయన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జేసీ సేతుమాధవన్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, అందరికీ గృహాలు, ఇళ్ల స్థలాల రీ వెరిఫికేషన్, నీటి తీరువా, ఆన్‌లైన్ సేవలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అందరికీ గృహాలు పథకం కింద జిల్లాలో 6 వేల దరఖాస్తులు అందాయని, వీటిని వెరిఫైచేసి వెంటనే ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. సచివాలయ సర్వేయర్లు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, వారికి వెంటనే మెమోలు జారీ చేసి జీతాలను నిలుపుదల చేయాలని ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రమణమూర్తిని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీఓలు సవరమ్మ, రామ్మోహన్‌రావు, ఆశయ్య, డిప్యూటీ కలెక్టర్ మురళీ, హౌసింగ్ పీడీమురళీ, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, డీటీలు పాల్గొన్నారు.

ఏవీవీపీలో బదిలీలు

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నలుగురు వైద్యులకు ఇతర జిల్లాకు బదిలీ అయినట్టు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి తెలిపారు. ఇతర జిల్లాల నుంచి వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రులకు 8 మంది బదిలీపై వచ్చారన్నారు. స్టాఫ్ నర్సులు ఐదుగురు ఇతర జిల్లాలకు బదిలీ కాగా, ఇతర జిల్లాల నుంచి 18 మంది స్టాఫ్ నర్సులు జిల్లాకు వచ్చారని తెలిపారు.

మత్తుపదార్థాలకు బానిసలు కావద్దు

- బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దు
- అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమరవాణా దినోత్సవంలో విశాఖరేంజ్ డీఐజీ పిలుపు



మత్తుపదార్థాల నివారణపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా బాలికల ఫ్లాష్ మాబ్

విజయనగరం క్రైమ్: మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, బంగారంలాంటి జీవితాన్ని ఏ ఒక్కరూ నాశనం చేసుకోవద్దని విశాఖ పోలీస్ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా విజయనగరం రింగ్ రోడ్డు వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పోలీస్‌శాఖ గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పొరుగు జిల్లాలు, రాష్ట్రంలో సాగుచేస్తున్న గంజాయి జిల్లా మీదుగా ఏడాది పొడవునా అక్రమ రవాణా సాగుతోందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అక్రమంగా పండిస్తున్న గంజాయి నిర్మూలనకు చర్యలు చేపట్టామన్నారు. 500 ఎకరాల్లో విస్తరించిన గంజాయి తోటలను ధ్వంసం చేశామన్నారు. డీజీపీ హరీష్ గుప్తా ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణా చేసేవారిపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత అలవాటు పడవొద్దని, క్షణికానందానికి లోనుకావద్దని కోరారు. కలిసికట్టుగా పనిచేస్తే గంజాయి రవాణా, వినియోగాన్ని అరికట్టవచ్చని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు సంకల్పం కార్యక్రమాన్ని చేపట్టామని, యువతలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 200లకు పైగా సంకల్ప సభలు నిర్వహించినట్టు వెల్లడించారు. కార్యక్రమం అనంతరం కళాశాలల విద్యార్థులతో వేదికపై ఉన్న అధికారులందరూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రింగ్ రోడ్డు నుంచి ఐస్ ఫ్యాక్టరీ, అయోధ్య మైదానం, సంస్కృత కళాశాల, సింహాచలం మేడ, కోట వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కోటవద్ద దాదాపు 40 నిమిషాల పాటు కళాశాలల విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయంటూ నృత్య రూపకం ప్రదర్శించారు. కార్యక్రమాన్ని డీఐజీ, కలెక్టర్, ఎస్పీ దగ్గరుండి తిలకించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, సహకార బ్యాంకు చైర్మన్ గొంప కృష్ణ, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు స్వప్నహైందవి, డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాస్, కాంతారావు, సీఐలు లక్ష్మణరావు, శ్రీనివాస్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జగన్నాథుని రథయాత్ర



జగన్నాథునికి బింబ దర్శనం ఏర్పాటుచేసిన అర్చకులు

విజయనగరం టౌన్: జగన్నాథస్వామి రథ యాత్ర మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యం లో స్వామివారికి గురువారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సంతపేట, దాసన్నపేట, మన్నార్ రాజ గోపాలస్వామి ఆలయం ఆవరణలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. విశ్వ క్సేనపూజ, పుణ్యాహవచనం, కళావాహన, బింబ దర్శనం, నేత్రోత్సవం, ప్రసాద వినియోగం గావించారు. సాయంత్రం స్వామివారి శాంతి కల్యాణోత్సవం, రాత్రి రథోత్సవానికి స్వామివారిని సిద్ధం చేశారు. రక్షాబంధనాలు ధరించారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు మేళతాళాలతో స్వామివారి రథారోహణ కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారులు, కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వేగావతి నదిలో అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆర్డీఓ జేవీవీ రామ్మోహనరావు గురువారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను నిలువరించేందుకు ప్రయత్నించినా డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో ఆర్డీఓ ఆదేశాల మేరకు మెట్టవలసలోని యజమాని మీసాల చంద్రశేఖర్ ఇంటి వద్ద ట్రాక్టర్‌ను ఆర్ఐ రామకుమార్, సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇసుక అక్రమ తరలింపు, ఆపకుండా వెళ్లిపోయినందుకుగాను రూ.20వేల జరిమానా విధించామని ఆర్ఐ రామకుమార్ తెలిపారు.

బ్యాటరీల చోరీ

- ఆందోళన చెందుతున్న వాహన యజమానులు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని కొత్తవలస ఫ్లైఓవర్ కింద పార్కింగ్ చేసి ఉంచిన మూడు లగేజీ వ్యాన్లు, ఒక లారీకి ఉన్న బ్యాటరీలను గుర్తుతెలియని దుండగులు అపహరించారని వాహన యజమానులు ఆందోళన చెందారు. గతంలో కూడా ఎన్నోమార్లు ఈ విధంగా వాహనాలకు ఉన్న బ్యాటరీలను వైర్లను చిందరవందరంగా కోసి దొంగిలించారని వాపోయారు. ఈ మేరకు గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గురువారం ఉదయం వాహనాల వద్దకు వెళ్లేసరికి వైర్లు కట్‌చేసి ఉండడంతో బ్యాటరీలు లేకపోవడాన్ని గమనించినట్లు తెలిపారు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దాడికి గురైన వ్యక్తి మృతి

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గ్రోత్‌సెంటర్‌లో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ స్టోర్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న కనిమెరకల వెంకటరమణ(55) పై ఈనెల 20న గుర్తు తెలియని వ్యక్తి దాడి చేశాడు. వెంకట రమణ కుమారుడు పురుషోత్తమరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కె.సతీష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎప్పటిలాగానే వెంకట రమణ విధులకు హాజరయ్యాడు. సరిగ్గా రాత్రి 12.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కంపెనీలోకి ప్రవేశించి బలమైన ఆయుధంతో వెంకటరమణ ముఖం, తలపై బలంగా దాడి చేశాడు. దీంతో వెంటనే స్థానికులు బొబ్బిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందాడు. దాడి చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు మూడు టీమ్‌లను నియమించామని, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

రామయ్యా..చూడవేమయ్యా..!

- పవిత్ర బోడికొండను తవ్వేస్తున్న అక్రమార్కులు
- మనోభావాలను దెబ్బతీస్తున్నారని భక్తుల ఆగ్రహం
- స్పందించని అధికార యంత్రాంగం

నెల్లిమర్ల రూరల్: సాక్షాత్తు శ్రీరాముడే నడయాడిన నేలగా రామతీర్థాన్ని భక్తులు విశ్వసిస్తుంటారు. నీలాచలం పర్వతంగా పిలుస్తున్న రామతీర్థంలోని బోడికొండపై పాండవులు సంచరించినట్లు చరిత్ర చెబుతోంది. కొండపై శ్రీ కోదండరాముడి ఆలయంతో పాటు అలనాటి చారిత్రక గుర్తులను చూసేందుకు సందర్శకులు నిత్యం కొండపైకి వెళ్తుంటారు. అంతటి సుదీర్ఘ చరిత్ర కలిగిన బోడికొండను సైతం అక్రమార్కులు విడిచిపెట్టడం లేదు. గడిచిన కొద్ది నెలలుగా ధనార్జనే లక్ష్యంగా శ్రీరాముడి కొండనే తవ్వేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. సీతారామునిపేట జంక్షన్ సమీపంలో ఉన్న కొండ వద్ద గడిచిన కొన్ని రోజులుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. సమీప గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండడంతో కొందరు అక్రమార్కులు జేసీబీలు, ట్రాక్టర్లను పెట్టి కొండను తవ్వేస్తున్నారు. పట్టపగలే ఈ వ్యవహారం జరుగుతున్నా..ఇటు దేవస్థానం అధికారులు కానీ, అటు రెవెన్యూ యంత్రాంగం కానీ స్పందించకపోవడం బాధాకరం. కొండపై ఉన్న పెద్దపెద్ద బండరాళ్లు సైతం కిందపడుతున్నాయంటే తవ్వకాలు ఏ విధంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ట్రాక్టర్ లోడును పరిధిని బట్టి రూ.600 నుంచి రూ.1000 వరకు అమ్మేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారి పక్కనే ఈ అక్రమ తవ్వకాలు జరుగుతుండడం గమనార్హం. ప్రభుత్వ భూములకు ఎలాగూ రక్షణ లేదు సరికదా.. సాక్షాత్తు దేవుడి కొండనైనా అక్రమార్కుల నుంచి కాపాడలేరా..? అంటూ భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోడికొండను తవ్వేస్తున్న అక్రమార్కులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



సీతారామునిపేట సమీపంలో ఉన్న బోడికొండ వద్ద గ్రావెల్ తవ్వకాలు



కొండపై నుంచి జారిపడిన బండరాయి

వృద్ధిరేటు పెరిగేలా ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: వ్యవసాయం, అనుబంధ రంగాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో వృద్ధిరేటు గణనీయంగా పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సుపరిపాలన కార్యక్రమం నేపథ్యంలో ప్రభుత్వ శాఖాధికారులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నిర్దేశించిన లక్ష్య సాధన దిశగా ప్రతి ఏటా 15 శాతం కంటే ఎక్కువ వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు వెళ్లేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయం, తృణధాన్యాలు, డ్రోన్ల వినియోగం, ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణతో అధిక ఆదాయం పొందాలని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పాల దిగుబడి గతేడాది కంటే ఈ ఏడాది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలని, పశు సంపదను ప్రోత్సహించడంతో అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే మిగిలిన అన్ని ప్రభుత్వ శాఖల వారికి నిర్దేశించిన లక్ష్యాల ప్రగతిలో వృద్ధి రేటు గణనీయంగా పెరగాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, అటవీ, పశుసంవర్ధక, వైద్యారోగ్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖల అధికారులు పి.వీర్రాజు, కె.రాబర్ట్ పాల్, వై.క్రాంతి కుమార్, వై.శ్రీదేవి, జేపీప్రసూన, డా.ఎస్.మన్మథ రావు, డా.ఎస్.భాస్కర రావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా.ఎం.వినోద్ కుమార్, డీఆర్‌డీఏ పీడీలు ఎం.సుధారాణి, డా.టి.కనకదుర్గ, వై.నాగేశ్వరరావు, పరిశ్రమల కేంద్రం ఎ.డి పి.సీతారాము, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఆర్అండ్‌బీ ఇరిగేషన్ ఈఈలు ఒ.ప్రభాకరరావు, ఎస్.రామచంద్రరావు, డీఎస్.ప్రదీప్, ఎ.ఢిల్లీశ్వర రావు, పంచాయతీ రాజ్ డీఈఈ కె.సంజీవరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల పరిరక్షణకు చర్యలు

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: దేవస్థానం భూముల్ని అన్ని విధాలా పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా స్థాయి దేవాదాయ భూముల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 11 వేల ఎకరాల భూమి దేవదాయ శాఖ పరిధిలో ఉందని అందులో కొంత ఆక్రమిత భూమి ఉందని, ఈ భూమికి వెంటనే సర్వే చేయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే మాన్సాస్ ట్రస్టుకు చెందిన భూమిలో కూడా ఆక్రమణలు ఉన్నాయని, ఇందులో వ్యవసాయ, నివాస, వాణిజ్య పరంగా ఆక్రమించిన వివిధ సంస్థల ఆక్రమిత భూములకు సంబంధించి రూ.50 లక్షల వరకు యూజర్ చార్జీల కింద ఆక్రమణదారులు చెల్లించారని తెలిపారు. అయితే ఎటువంటి యూజర్ చార్జీలు చెల్లించకుండా కమర్షియల్‌గా వినియోగిస్తున్న దేవదాయ భూముల్లోని సముదాయాలను తొలగించాలని, అందుకు రెవెన్యూ అధికారులు పోలీస్ వారి సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. భూముల విషయంలో కోర్టు ఆర్డర్స్‌ను వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు. మ్యుటేషన్స్ చేయవలసిన వాటి వివరాలను మండలాల వారీగా ఆర్‌డీఓలకు అందజేయాలని, ఆర్‌డీఓలు వెంటనే మ్యుటేషన్ జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, దేవదాయశాఖ ఎ.సి శిరీష, ఆర్‌డీఓలు సవరమ్మ, రామ్‌మోహన్ రావు, ఆశయ్య, సర్వే ఎ.డి రమణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జున రావు, డీఎస్పీ వీరకుమార్, డిప్యూటీ కమిషనర్, ఏఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

పార్వతీపురం: గ్రామసర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్వేయర్ల సంఘం నాయకుడు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల సర్వీసు పూర్తయినప్పటికీ రేషనలైజేషన్‌లో కానీ, బదిలీ ప్రక్రియనులోకానీ తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. గ్రామ సర్వేయర్లుగా ఉన్న తమకు సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గరుగుబిల్లి, పార్వతీపురం, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, పాలకొండ, వీరఘట్టం, సీతంపేట తదితర మండలాల నుంచి సర్వేయర్లు పాల్గొన్నారు.

మలేరియాతో గిరిజన విద్యార్థిని మృతి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని తామరకండి జమ్ము బాలికల వసతి గృహంలో ఆరో తరగతి చదువుతున్న కడ్రక తనూజ మలేరియా జ్వరంతో గురువారం మృతి చెందింది. గొర్లి గ్రామానికి చెందిన తనూజ ఇంకా ఆశ్రమ పాఠశాలకు వెళ్లలేదు. కొద్దిరోజులుగా మలేరియా జ్వరంతో బాధపడుతుండడంతో పార్వతీపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక జ్వరంతో మృతి చెందడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మలేరియా నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.



మలేరియాతో మృతి చెందిన తనూజ

ఎరువులు అమ్మలేం

- చేతులెత్తేస్తున్న డీలర్లు
- ఆందోళనలో రైతులు
- ఫెర్టిలైజర్స్ కొనుగోలు చేయాలంటే, నానో యూరియా కాంప్లెక్స్ ఎరువుల కొనుగోలు తప్పనిసరి
- భారాన్ని రైతులపై రుద్దుతున్న ఎరువుల డీలర్లు
- ఆర్ఎస్‌కేలో ఎరువులు నిల్వచేసేందుకు గొడౌన్‌లు కరువు

మక్కువ: ఫెర్టిలైజర్స్ కంపెనీల ఒత్తిళ్లకు ఎరువుల డీలర్లు తలొగ్గి, ధరల భారాన్ని మోస్తూ, ఆ భారాన్ని రైతులపై మోపుతున్నారు. వాస్తవానికి ఫెర్టిలైజర్స్ కంపెనీల నుంచి నేరుగా వాహనాలపై దుకాణాలకు ఎరువులు పంపించాల్సి ఉంది. ప్రస్తుతం రైళ్లలో సమీప పట్టణాలకు ఎరువులు చేరుకుంటున్నాయి. అక్కడి నుంచి మండలకేంద్రాలకు తరలించాలంటే బస్తాకు రూ.50, గ్రామీణ ప్రాంతాల్లోని ఎరువుల దుకాణానికి చేర్చాలంటే బస్తాకు రూ.70వరకు ఎరువుల డీలర్లపై భారం పడుతోంది. ఆ భారాన్ని డీలర్లు మోయలేక, ఆరుగాలం శ్రమించి పండిస్తున్న అన్నదాతపై భారం మోపడంతో రైతన్నలు విలవిల్లాడుతున్నారు.

నానో, కాంప్లెక్స్ ఎరువుల కొనుగోలు చేయాలి

ఎరువుల డీలర్లు ఫెర్టిలైజర్స్ కంపెనీల నుంచి యూరియా, డీఏపీ కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా వారి దగ్గర నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేయాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నట్లు గురువారం ఏడీఏ ఎం.మధుసూదనరావు సాలూరులో నిర్వహించిన సమావేశంలో మక్కువ మండలానికి చెందిన డీలర్లంతా గగ్గోలు పెట్టారు. నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులను రైతులకు విక్రయించలేక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు డీలర్లు వాపోయారు. ఇలా అయితే ఎరువులు విక్రయించలేమంటూ డీలర్లు చేతులెత్తేస్తున్నారు.

ఆర్ఎస్‌కేలో గొడౌన్ సౌకర్యం నిల్

రైతుసేవా కేంద్రాలలో ఎరువులు నిల్వచేసేందుకు గొడౌన్ సౌకర్యం లేకపోవడంతో, అధికారులు రైతులకు అవసరమైన ఎరువులను నిల్వ చేయలేకపోతున్నారు. దీంతో రైతులకు అవసరమైన సమయాల్లో ఎరువులు లభ్యం కాకపోవడంతో, ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఎంఆర్‌పీ కంటే, ఏకంగా ఒక్కో బస్తాపై రూ.50నుంచి, రూ.70 వరకు ఎరువుల దుకాణదారులు వసూలు చేస్తున్నారని, కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించి, రసీదులు ఇవ్వకుండా, తెల్లకాగితంపై అక్షరాలు రాసి పంపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్‌సీజన్ ప్రారంభానికి ముందే ఎరువుల విక్రయం దందా ఇంతలా సాగుతుంటే, ముందుముందు, అత్యవసర సమయంలో ఏ విధంగా ధరలు ఉంటాయోనని రైతులు తలలు పట్టుకుంటున్నారు.

రైతుల అవసరం మేరకు ఎరువులు

మక్కువ మండలంలో సుమారు 10,800 ఎకరాల్లో వరి, 859 ఎకరాల్లో మొక్కజొన్న, 558ఎకరాల్లో పత్తి పంటలను రైతులు ఏటా సాగుచేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకోసం యూరియా 224టన్నులు, డీఏపీ 254టన్నులు మండలానికి తీసుకువచ్చినట్లు వ్యవసాయాధికారిణి చింతల భారతి తెలిపారు. రెండురోజుల్లో సొసైటీలకు యూరియా, డీఏపీ 200టన్నులు, ఆర్ఎస్‌కేలకు 80టన్నుల యూరియా, డీఏపీ తెప్పిస్తున్నామని ఆమె చెప్పారు. ఎరువులు ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులందితే, సంబంధిత దుకాణం లైసెన్స్ రద్దుచేస్తామని ఆమె స్పష్టం చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్/గరుగుబిల్లి: మండలంలోని గొల్లవానివలసకు చెందిన ఓ మహిళ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్తాపానికి గురై కన్నవారి ఊరు పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురంలో గడ్డిమందు తాగి గురువారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు హుటాహుటిన పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు అవుట్‌పోస్టు ఏఎస్సై ఎన్. భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు వివరాలు సేకరిస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

శృంగవరపుకోట: ఇంటిముందు మావిడాకుల తోరణాలు వాడనేలేదు. పెళ్లింట సందడి ముగియనే లేదు. విధి ఆడిన ఆటలో నవవరుడు ప్రాణాలు చాలించాడు. తాళికట్టిన భర్త తరలిరాని లోకాలకు వెళ్లాడని తెలిసి నవవధువు శోకంతో కుప్పకూలిపోయింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లగుడు ప్రదీప్(26)కు ఇటీవల పెళ్లయింది. ప్రదీప్ తల్లితో కలిసి గురువారం గడ్డి కోసేందుకు వెళ్లాడు. గడ్డిమోపు పట్టుకుని తిరిగి వస్తున్న సమయంలో తెగి ఉన్న విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో తల్లి అరుపులతో పక్క పొలాల్లో ఉన్న గ్రామస్తులు పరుగున వచ్చి చూసేసరికే ప్రదీప్ అనంతలోకాలకు వెళ్లిపోయాడు. భర్త పార్థివదేహాన్ని చూసి భార్య ఏడుస్తుంటే గ్రామస్తుల కళ్లు చెమర్చాయి. కాగా ఈ ఘటనపై ఇటు విద్యుత్‌శాఖ అధికారులు కానీ, అటు పోలీస్ ఉద్యోగులు కానీ నోరు మెదపలేదు. ఎటువంటి సమాచారం ఇవ్వలేదు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ప్రదీప్

దోమల కాయిల్స్‌తో అనర్థాలు

- మార్కెట్‌లో విచ్చలవిడిగా నాశిరకం బ్రాండ్ల విక్రయాలు
- సహజ పద్ధతులే మేలంటున్న వైద్యులు

పార్వతీపురం: దోమకాటుతో అనారోగ్యానికి గురవుతామన్న భయంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మార్కెట్‌లో లభించే మస్కిటో కాయిల్స్‌ను వాడడం పరిపాటిగా మారింది. మార్కెట్‌లో లభించే మస్కిటో కాయిల్స్‌తో పాటు మస్కిటో అగరబత్తీలను విరివిగా వినియోగిస్తున్నారు. వాటి ద్వారా వచ్చే పొగతో దోమలు రావని భావించి వెలిగిస్తుంటారు. పొగ బయటకు పోకుండా ఇంట్లోని తలుపులన్నీ బిగించి ఈ కాయిల్స్‌ను వెలిగిస్తారు. ఈ పొగలో కార్సినోజెనిక్ రసాయనాలు కలిగిఉండడం వల్ల ఆస్తమా ఉన్న వారికి, చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులకు శరీరంలో పలు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిజానికి మస్కిటో కాయిల్స్ వినియోగం వల్లే కేవలం దోమలు చనిపోవడం లేదు. ఆ పొగ ఉన్నంత సేపు దోమలు సంచరించేందుకు వీలులేక మగతగా ఉండి వాసన తగ్గిన తరువాత అలాగే పొగ ప్రభావం తగ్గిన వెంటనే యథావిధిగా మళ్లీ దోమలు దాడికి పాల్పడతాయి. రోజురోజుకు దోమలు ప్రబలడంతో మార్కెట్‌లోకి నాశిరకం బ్రాండ్లు కూడా వచ్చి ప్రజల ఆరోగ్యాన్ని మరింత ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి.



దోమలు చంపేందుకు వాడుతున్న కాయిల్స్

ప్రకటనలతో మరింత ఆకర్షణగా..

గతంలో రీఫిల్స్‌ను 30, 35, 60 రాత్రులు పనిచేస్తాయంటూ విక్రయించేవారు. ప్రస్తుతం హై, లో ఆప్షన్లతో 45 ఎంఎల్ రీఫిల్స్‌ను విక్రయిస్తున్నారు. వాటిని హైలో పెట్టుకుంటే 10 నుంచి 15 రోజులు వస్తాయి. లో ఆప్షన్‌లో పెడితే 20 నుంచి 25రోజుల వరకు వస్తాయన్న ప్రత్యేకమైన ప్రకటనలతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. అయితే ఇది తాత్కాలిక ఉపశమనంగా ఉన్నప్పటికీ ముందుముందు ఆరోగ్యానికి ప్రమాదమేనని వైద్యునిపుణులు హెచ్చరిస్తున్నారు, రీఫిల్స్‌లో ఉండే ప్రాలేత్రిన్, పెర్మెత్రిన్, ట్రాన్స్‌ఫ్లోత్రిన్ వంటి కృత్రిమ కీటక నాశకాలు వెలువడే పొగతో మన శ్వాసకోస వ్యవస్థ మరింత ప్రభావితం అవుతుంది. ఈ రసాయనాలు వాయువులో చేరి ఊపిరితిత్తులను బాధించి ఆస్తమా, బ్రాంకైటీస్ వంటి శ్వాససంబంధిత వ్యాధులకు దారితీసే ప్రమాదం ఎక్కువగా ఉందని పరిశోధనలు సైతం వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే పార్వతీపురం, పాలకొండ, కురుపాం పరిసరాలలో ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

సహజ మార్గాలను ఉపయోగిస్తే మేలు



ప్రజలు ఈ దోమల ప్రభావం నుంచి కాపాడుకునేందుకు కాయిల్స్, రీఫిల్స్ వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వాడిన తరువాత గదిని బాగా వెంటిలేట్ చేయాలి. ఈ నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే రసాయన రీఫిల్స్‌కు బదులు సహజ మార్గాలను ఉపయోగించాలి. నిమ్మ, లవంగం, తులసి వంటి సహజ పదార్థాల ద్వారా దోమలను దూరం చేసే ప్రయత్నాలు అనారోగ్యానికి గురిచేయకుండా మేలుచేస్తాయి. వీలైనంత మేరకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పడుకోవడానికి ఉపయోగించే బెడ్‌షీట్లు ఎండలో ఉంచుతూ శుభ్రం చేసుకోవాలి. కిటికీలు, వెంటిలేషన్స్‌కు మెస్‌ల అమరిక మంచిది. పడుకునే గదిలో గాలి ఆడేలా చూసుకుంటూ అవసరమైతే దోమతెరలు వినియోగించాలి. – డా.ఎస్ఎంకే తిరుమల ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యాధికారి, బందలుప్పి